క్లుప్తంగా

రంజాన్ కానుకల పంపిణీ



ముస్లింలకు రంజాన్ కానుకలు అందజేస్తున్న కార్పొరేటర్

జగద్గిరిగుట్ట: తెలంగాణ ప్రభుత్వం మైనార్టీల అభ్యున్నతికి ఎంతో తోడ్పాటును అందిస్తోందని జగద్గిరిగుట్ట కార్పొరేటర్ జగన్ అన్నారు. సోమవారం జగద్గిరిగుట్ట రాజీవ్‌గృహకల్పలో ముస్లింలకు ఆయన రంజాన్ తోఫాలను అందజేశారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. ముస్లింలు రంజాన్‌ను సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ రషీద్, గంగా సంతోష్‌కుమార్, ప్రభాకర్, మహమ్మద్ రంజాన్, అబ్దుల్ వాహిద్, మోయిన్, ఇమామ్ లతీఫ్, నర్సింహారెడ్డి, విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో వైఎస్సార్‌టీపీ బలోపేతానికి కృషి

కుత్బుల్లాపూర్: మేడ్చల్ జిల్లాలో వైఎస్సార్‌టీపీ బలోపేతానికి శాయశక్తులా కృషి చేస్తున్నామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు దేశిరెడ్డి సురేష్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్‌టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల ఆదేశానుసారం సోమవారం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కమిటీని ప్రకటించారు. జిల్లా ఉపాధ్యక్షుడిగా ఏనుగుల భాస్కర్‌రెడ్డి, లీగల్ సెల్ అధ్యక్షుడిగా మేడికొండ కొండలరావు, జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శిగా మేడికొండ శాంసన్ జార్జ్‌లను నియమించారు. ఈ సందర్భంగా సురేష్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎప్పుడు ఎన్నికలు జరిగినా వైఎస్ షర్మిల నేతృత్వంలో వైఎస్సార్‌టీపీని ఆదరించేందుకు తెలంగాణ ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

విద్యార్థులకు బెల్ట్ టెస్ట్



షాపూర్‌నగర్ పాఠశాలలో జరిగిన మార్షల్ ఆర్ట్స్ బెల్ట్ టెస్ట్‌లో పాల్గొన్న మదన్‌గౌడ్

కుత్బుల్లాపూర్: చరణ్ సెల్ఫ్ డిఫెన్స్, మార్షల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో సోమవారం షాపూర్‌నగర్‌లోని జిల్లా పరిషత్‌ఉన్నత పాఠశాలలో విద్యార్థులు బెల్ట్ టెస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సీపు శేఖర్, సీపు శ్రీనివాస్‌రావు, వెంకటేష్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. బ్లాక్ బెల్ట్ విభాగంలో ప్రతిభ కనబరిచి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ప్రణయ్, సన్నీ, మణికంఠ, నందిని, శ్రావణి, బ్రౌన్ బెల్ట్ సాధించిన నాగవర్షిత తదితరులకు స్కూల్ చైర్మన్ మదన్‌గౌడ్, కుంగ్‌ఫూ మాస్టర్ కిన్నెర రవి బెల్ట్‌లు, సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు.

ఎట్టకేలకు భారీ షెడ్డు కూల్చివేత



బీరప్పనగర్ సమీపంలో నిర్మిస్తున్న అక్రమ షెడ్డును కూల్చివేస్తున్న దృశ్యం

కుత్బుల్లాపూర్: అనుమతులు లేకుండా నిర్మిస్తున్న భారీ షెడ్డును సర్కిల్ అధికారులు ఎట్టకేలకు కూల్చివేశారు. జీడిమెట్ల డివిజన్ బీరప్పనగర్‌కు వెళ్లే దారిలో 400 గజాల స్థలంలో నిర్మిస్తున్న అక్రమ షెడ్డు విషయమై సాక్షిలో ఈ నెల 5న ప్రచురితమైన 'అక్రమ భారీ షెడ్డు నిర్మాణం' కథనానికి సర్కిల్ అధికారులు స్పందించారు. సోమవారం ఉపకమిషనర్ మంగతాయారు ఆదేశానుసారం టౌన్‌ప్లానింగ్ అధికారి ప్రభావతి పర్యవేక్షణలో అక్రమ షెడ్డును జేసీబీతో తొలగించారు. మరోసారి షెడ్డు నిర్మాణం చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరికలు జారీ చేశారు.

పరామర్శ



జెమ్మి దేవేందర్‌ను పరామర్శిస్తున్న ప్రభుత్వ విప్ శంభీపూర్‌రాజు

దుండిగల్: కొంపల్లి మున్సిపల్ బీఆర్ఎస్ నేత జెమ్మి దేవేందర్‌ను సోమవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు పరామర్శించారు. కొన్ని రోజులుగా దేవేందర్ అనారోగ్యంతో బాధ పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఆయన దేవేందర్ ఇంటికి వెళ్లి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. బౌరంపేట్ పీఏసీఎస్ చైర్మన్ మిద్దెల బాల్‌రెడ్డి, కార్పొరేటర్లు జగన్, మంత్రి సత్యనారాయణ, కౌన్సిలర్ డప్పు కిరణ్, మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి, సోమేశ్ యాదవ్, వెంకటేష్‌గౌడ్, మురళి యాదవ్, విష్ణువర్ధన్‌రెడ్డి, మహేష్, శంభీపూర్ రాము, ఖదీర్ ఉన్నారు.

కార్డు జాడేదీ..?

దరఖాస్తులకే పరిమితమైన ఆహార భద్రత కార్డుల జారీ ప్రక్రియ

- కొత్త కార్డుల కోసం తహశీల్దార్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ
- ఏళ్లు గడుస్తున్నా.. కార్డుల మంజూరులో తీవ్ర జాప్యం
- మ్యుటేషన్ల దరఖాస్తులను పట్టించుకునే వారే కరువు
- పెండింగ్‌లో 69,326 మ్యుటేషన్ల దరఖాస్తులు



సాక్షి, మేడ్చల్ జిల్లా: ఆహార భద్రత కార్డుల జారీ ప్రక్రియ కేవలం దరఖాస్తులకే పరిమితమైంది. దరఖాస్తులు చేసి ఏళ్లు గడుస్తున్నా.. కార్డుల మంజూరులో తీవ్ర జాప్యంతో దరఖాస్తుదారులు తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. ఆసరా పింఛన్లు, ఆరోగ్యశ్రీ, కల్యాణ లక్ష్మీ, ఉపకారవేతనాల మంజూరు, ముఖ్యమంత్రి సహాయ నిధి వంటి దరఖాస్తులకు ఆహార భద్రత కార్డును ప్రామాణికంగా తీసుకోవడంతో కొత్త కార్డుల మంజూరు లేక.. అర్హత ఉన్నా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని దుస్థితి ఏర్పడింది.

దరఖాస్తుదారుల నిరీక్షణ

జిల్లాలో 15 మండలాలకుగాను 5,23,842 ఆహార భద్రత కార్డులు ఉండగా వాటిలోని 17,24,481 మంది సభ్యులకు ప్రతినెలా ప్రభుత్వం చౌకధరల దుకాణాల ద్వారా రేషన్ బియ్యాన్ని పంపిణీ చేస్తోంది. కార్డులో ఎంత మంది ఉంటే.. అంత మందికి పరిమితి లేకుండా ప్రతినెలా 6 కిలోలు, అంత్యోదయ కార్డుదారులకు కార్డుకు 35 కిలోల వంతున బియ్యం పంపిణీ చేస్తోంది. కొత్తగా వివాహం చేసుకున్న వారు భార్యాభర్తలు పాత కార్డుల్లో తమ పేర్లను తొలగించుకొని నూతన కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. పాత కార్డుల్లోంచి దరఖాస్తుదారుల పేర్లను తక్షణం తొలగించిన అధికారులు నూతన కార్డులు మంజూరు చేయకపోవడంతో వారి పరిస్థితి రెంటికి చెడ్డ రేవడిలా తయారైంది. పిల్లలు పుట్టాక వారి పేర్లను రేషన్ కార్డుల్లో చేర్చడానికి దరఖాస్తు చేసుకుంటున్న వారికి నిరాశే ఎదురవుతోంది. గతంలో 95,040 దరఖాస్తులు రాగా, వాటిలో సుమారు 985 కార్డులను మాత్రమే మంజూరు చేసి సంబంధిత అధికారులు చేతులు దులుపుకున్నారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా మ్యుటేషన్ల(చేర్పులు, మార్పుల) కోసం పెట్టుకున్న 69,326 దరఖాస్తులు ఇంకా పెండింగ్‌లోనే అపరిష్కృతంగా ఉన్నాయి. ప్రస్తుతం మీ సేవ కేంద్రాల్లో నూతన కార్డుల కోసం దరఖాస్తు ప్రక్రియ అందుబాటులో లేకపోవడంతో పలువురు దరఖాస్తు చేసుకోలేకపోతున్నారు.

వేగవంతం చేయాలి

మా అబ్బాయికి 5 సంవత్సరాల వయస్సు ఉన్నప్పుడు రేషన్ కార్డులో పేరు నమోదు కోసం మీ సేవలో దరఖాస్తు చేశా. ఇప్పటికీ అతడి వయస్సు 8 సంవత్సరాలు, తహసీల్దార్ కార్యాలయంలో అడిగితే మా చేతిలో ఏమీ లేదు.. మేము పరిశీలన జరిపి సంబంధిత అధికారులకు పంపించామని చెబుతున్నారు. అర్హులకు ఆహార భద్రత కార్డు అందేలా కార్డుల జారీ ప్రక్రియను వేగవంతం చేయాలి.

– బి.కిరణ్‌రెడ్డి, బోడుప్పల్

ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా..

మండలాల వారీగా అర్హులైన వారితో జాబితా సిద్ధంగా ఉంది. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే నూతన ఆహార భద్రత కార్డులు మంజూరు చేస్తాం. ప్రభుత్వం ప్రస్తుతం కొత్త రేషన్ కార్డు దరఖాస్తు ప్రక్రియను నిలిపివేసింది. సవరణ కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం ఉన్నా.. ప్రభుత్వం, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకుంటాం.

– తనుజా, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా

బీజేపీతోనే సామాజిక న్యాయం



సామాజిక న్యాయ వారోత్సవాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: బీజేపీతోనే అన్ని వర్గాల ప్రజలకు సామాజిక న్యాయం జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. బీజేపీ సామాజిక న్యాయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం బీజేపీ మహిళా మోర్చా కుత్బుల్లాపూర్ డివిజన్ అధ్యక్షురాలు అలివేలు ఆధ్వర్యంలో వాణినగర్‌లో సహపంక్తి భోజన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీశైలంగౌడ్ దళిత మహిళలు, కార్యకర్తలతో కలిసి భోజనం చేశారు.

◆ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశంలో అన్ని వర్గాల ప్రజల ఆదరణను పొందుతున్న ఏకైక పార్టీ బీజేపీ అని అన్నారు. బీజేపీతోనే పేద, బడుగు, బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు రాజేశ్వర్‌రావు , సెన్సార్ బోర్డు సభ్యుడు నటరాజ్ గౌడ్, బీజేపీ నాయకులు దయాకర్, రవి, భూషణం, పలువురు మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

◆ అదే విధంగా కొంపల్లి మున్సిపాలిటీ పరిధి దూలపల్లి గ్రామంలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై బీజేఎంఎం నాయకులు, పారిశుద్ధ్య సిబ్బందితో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, కౌన్సిలర్లు రాజిరెడ్డి, జనార్దన్‌రెడ్డి, శ్యామల, విజయలక్ష్మి, సరిత, సంధ్య, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పని చేయాలి



అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహిస్తున్న మేయర్ నీలారెడ్డి

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో అధికారులు సమన్వయంతో పని చేయాలని మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న రోడ్ల విస్తరణ, డ్రైనేజీ పనులు, ఓపెన్ జిమ్‌లు, వైకుంఠధామాలు, మంజీర నీటి పైపులైన్ల పనులపై సోమవారం ఆయా విభాగాల అధికారులతో మేయర్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా పనులను వేగవంతంగా పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు చిట్ల దివాకర్, ఆగం రాజు ముదిరాజ్, ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్, శానిటరీ, జలమండలి అధికారులు పాల్గొన్నారు.

'మోసపూరిత హామీలను నమ్మే స్థితిలో ప్రజలు లేరు'



హాథ్ సే హాథ్ జోడో యాత్రలో కరపత్రాలను అందజేస్తున్న టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూపతిరెడ్డి

రంగారెడ్డినగర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మోసపూరిత హామీలను నమ్మేస్థితిలో రాష్ట్ర ప్రజలు లేరని.. ఎప్పుడు ఎన్నికలు నిర్వహించినా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. సోమవారం రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని ఇందిరాగాంధీనగర్‌లో ఆయన హాథ్ సే హాథ్ జోడో యాత్ర చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ విధానాలు, చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలను ముద్రించిన కరపత్రాలను ఇంటింటికి తిరుగుతూ పంపిణీ చేస్తూ ప్రచారం చేశారు.

◆ అనంతరం హన్మంతరెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. నేడు బీఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వాల పాలనలో నిత్యవసరాలు ఆకాశానంటాయని, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే వంట గ్యాస్ సిలీండర్‌ను రూ.500లకే అందిస్తామన్నారు.

◆ అదే విధంగా పొదుపు సంఘాలకు తక్కువ వడ్డీతో రుణాలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ జాయింట్ సెక్రటరీ సువ్వారి శ్రీనివాస్, ఐఎన్‌టీయూసీ నాయకుడు అమర్ బాబు, మాజీ వార్డు సభ్యుడు శివకుమార్, శ్రీనివాస్, హమ్మిరెడ్డి, గురువారెడ్డి, శ్యామ్, ప్రవీణ్, నర్సింగ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నాయి: భూపతిరెడ్డి

దుండిగల్: కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నాయని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి అన్నారు. సోమవారం ఆయన దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని గాగిల్లాపూర్ గ్రామంలో కాంగ్రెస్ నాయకులు నవీన్‌రెడ్డి, శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో జరిగిన హాథ్ సే హాథ్ జోడో యాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానికంగా నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్న భూపతిరెడ్డి వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో దుర్మార్గపు పాలన కొనసాగుతోందన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమన్నారు.

ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు సదానందం, 128 డివిజన్ అధ్యక్షులు ఫలాహ్ ఉర్ రహ్మాన్, ఏఐసీసీ హ్యూమన్ రైట్స్ రాష్ట్ర యువజన అధ్యక్షుడు రాధాకృష్ణ, మాజీ వార్డు సభ్యులు పరశురాంగౌడ్, రాష్ట్ర మైనారిటీ సెల్ కోఆర్డినేటర్ సమీర్ ఖాన్, మండల కిసాన్ సెల్ అధ్యక్షులు రాజిరెడ్డి, నాయకులు విజయ్‌గౌడ్, చిరంజీవి, సీతారామ్‌రెడ్డి, ధర్మారెడ్డి, ప్రవీణ్‌గౌడ్, బండి సాయి, గౌతం, దుబాయ్ మల్లారెడ్డి, సతీశ్, సుమన్, దీపక్‌రెడ్డి, నిరంజన్, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నిజాంపేట్: విద్యుత్ ఫీడర్ల నిర్వహణ నేపథ్యంలో మంగళవారం సరఫరాలో అంతరాయం కలుగనుందని బాచుపల్లి ఏఈ ఓ ప్రకటనలో తెలియజేశారు. 11కేవీ నిజాంపేట్, ఎస్ఎంఎస్, మా విల్లాస్ ఫీడర్ల పరిధిలో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఎస్‌వీఎస్ ఆభర్ణ, కాకతీయ హిల్స్, శ్రీనిధిహిల్ పార్క్, కేజీఎం విల్లాస్, ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

కుత్బుల్లాపూర్: మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమిస్తూ ముందుకు సాగుతున్నామని కొంపల్లి మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్ అన్నారు. కొంపల్లి మున్సిపల్ 7వ వార్డులోని శ్రీనివాసకాలనీలో రూ.11 లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులను సోమవారం స్థానిక కౌన్సిలర్ సూర్యకళతో కలిసి చైర్మన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీశైలంయాదవ్ మాట్లాడుతూ... అన్ని వార్డుల్లో ప్రాధాన్య క్రమంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ వంటి సదుపాయాలు కల్పిస్తూ వస్తున్నామన్నారు. ప్రజలకు ఏ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ శ్రీహరి, డీఈఈ చిరంజీవులు, ఏఈ ప్రవీణ్‌కుమార్, కౌన్సిలర్ సన్న రవియాదవ్, బీఆర్ఎస్ ప్రెసిడెంట్ ప్రభాకర్‌రెడ్డి, కాలనీవాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్లీ బర్డ్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

దుండిగల్: ఎర్లీ బర్డ్ పథకాన్ని మున్సిపల్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని దుండిగల్ మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణరావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎర్లీ బర్డ్ పథకానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. సోమవారం పలువురు దుండిగల్ మున్సిపల్ మేనేజర్ సునందకు ఈ పథకం కింద ఇంటి పన్నులు చెల్లించి 5 శాతం రిబేటు పొందారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఏప్రిల్ 30వ తేదీ లోపు ఇంటి పన్ను చెల్లించే వారికి ఎర్ల బర్డ్ పథకం వర్తిస్తుందన్నారు.

సంక్షిప్త వార్తలు

సెల్ టవర్ నిర్మాణాన్ని అడ్డుకోవాలి



నిజాంపేట్: నిజాంపేట కార్పొరేషన్ పరిధి స్ప్రింగ్ విల్లా కాలనీలో ఏర్పాటు చేయనున్న సెల్ టవర్ నిర్మాణాన్ని అడ్డుకోవాలని సోమవారం మున్సిపల్ కమిషనర్‌కు కాలనీవాసులు వినతి పత్రం సమర్పించారు. ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే మొబైల్ టవర్‌ను నివాసిత ప్రాంతాల మధ్య ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. జిమ్‌తో పాటు చిన్నపాటి ఫంక్షన్‌లు చేసుకునే స్థలంలో టవర్ ఏర్పాటు చేస్తుండటంతో దాని ద్వారా వెలువడే రేడియేషన్ వల్ల అనారోగ్యం బారిన పడతామని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు వెంటనే టవర్ ఏర్పాటు చేస్తున్న ప్రాంతాన్ని పరిశీలించాలని కోరారు. మున్సిపల్ అధికారులు పట్టించుకోకుంటే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని హెచ్చరించారు.

తుమార్ చెరువును కాపాడాలి

సుభాష్‌నగర్: ప్రమాదపుటంచుల్లో ఉన్న తుమార్ చెరువును కాపాడాలని కొంపల్లి మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. దూలపల్లిలోని చర్మాస్ రోడ్డును ఆనుకొని ఉన్న తుమార్ చెరువు ఎఫ్‌టీఎల్ స్థలాన్ని ఓ వ్యక్తి మట్టితో నింపుతూ హద్దురాళ్లను సైతం తీసేశాడని పేర్కొన్నారు. ఈ స్థలాన్ని తహసీల్దార్‌తో పాటు అధికారులు పరిశీలించి పోసిన మట్టిని తొలగించాలని ఆదేశించినా సదరు వ్యక్తి బేఖాతర్ చేస్తున్నాడని తెలిపారు. ఫిర్యాదు చేసిన వారిలో కౌన్సిలర్ రవీందర్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

గుండె జబ్బుల నివారణపై అవగాహన



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న డా.విజయభాస్కర్

కుత్బుల్లాపూర్: కోవిడ్ అనంతరం సంభవిస్తున్న గుండెపోటు మరణాలపై సోమవారం ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో ఉద్యోగులకు కొంపల్లిలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాలులో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎక్సైజ్ సూపరిడెంట్ విజయభాస్కర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని రంగారెడ్డి జిల్లా అసిస్టెంట్ కమిషనర్ చంద్రయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మెంబర్, ఆర్థోపెడిక్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ విజయభాస్కర్‌గౌడ్ గుండెకు సంబంధించిన జబ్బులు, వాటికి ప్రాథమిక చికిత్సలు, నివారణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో నిర్వహించే సీపీఆర్ విధానంపై శిక్షణ ఇచ్చారు. అనంతరం ఉద్యోగులు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరిడెంట్ మాధవయ్య, కుత్బుల్లాపూర్, బాలానగర్, మేడ్చల్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర యాదయ్య, వేణుకుమార్, జగన్‌మోహన్‌రెడ్డి, సబ్‌ఇన్‌స్పెక్టర్లు, కానిస్టేబుళ్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

తక్కువ ఖర్చులో అత్యాధునిక వైద్య సేవలు



బాచుపల్లి మమత ఆస్పత్రిని సందర్శించిన వివిధ గ్రామాల సర్పంచ్‌లు

నిజాంపేట్: గ్రామీణ ప్రాంత ప్రజలకు అతి తక్కువ ఖర్చుతో వైద్య సేవలు అందిస్తామని మమత అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్స్ ఎండీ పువ్వాడ నయన్ రాజ్ అన్నారు. సోమవారం బాచుపల్లిలోని మమత ఆస్పత్రిలో మెదక్, తూప్రాన్, బొల్లారం, గుమ్మడిదల, నర్సాపూర్, జహీరాబాద్, కోహిర్, హవేలీ, ఘనపూర్ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలతో నయన్‌రాజ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మెడికల్ డైరెక్టర్ డా. చంద్రశేఖర్ ఆస్పత్రిలో అందిస్తున్న వైద్య సేవలు, శస్త్ర చికిత్సలపై అవగాహన కల్పించారు. గ్రామాల నుంచి వచ్చే రోగులకు అతి తక్కువ ఖర్చులో అత్యాధునిక వైద్య సేవలు అందిస్తున్నామని దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డా. ప్రణీత్, ఆర్ఎంఓ నవీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

జగద్గిరిగుట్ట: అప్పుల బాధతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన జగద్గిరిగుట్ట ఠాణా పరిధిలో జరిగింది. గాజులరామారానికి చెందిన పలగిరి కేశవ (47)వృత్తిరీత్యా సివిల్ కాంట్రాక్టర్. కాగా ఆదివారం రాత్రి యథావిధిగా తన భార్య, కుమార్తెతో నిద్రపోయారు. అర్ధరాత్రి లేచి చూడగా కేశవ కనిపించకపోవడంతో బయటకు వెళ్లి చూడగా బాల్కనీలో ఉన్న ఇనుప కడ్డీకి చున్నీతో ఉరి వేసుకొని కనిపించాడు. స్థానికుల సహాయంతో ఆస్పత్రికి తరలించేలోపే మార్గ మధ్యలో చనిపోయాడు. తెలిసిన వారి వద్ద అప్పు తీసుకోవడంతో పాటు బ్యాంక్ లోన్ తీసుకున్నాడని తెలిపారు. వారి నుంచి ఒత్తిడి భరించలేకనే తన భర్త ఆత్మహత్య చేసుకున్నాడని కేశవ భార్య మల్లీశ్వరీ ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఇఫ్తార్‌కు వెళ్లొచ్చే సరికి ఇల్లు గుల్ల

జగద్గిరిగుట్ట: భారీ మొత్తంలో బంగారు ఆభరణాలు, నగదు చోరీ జరిగిన సంఘటన జగద్గిరిగుట్ట ఠాణా పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉషోదయకాలనీకి చెందిన అఫ్సర్ ఆదివారం తన అన్న మహమద్ కోమర్ రోడామేస్త్రీ నగర్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు వెళ్లారు. ఆదివారం రాత్రి 11.30 నిమిషాల ప్రాంతంలో తిరిగి ఇంటికి చేరుకున్న అఫ్సర్‌కు తన ఇంటి తాలం పగలగొట్టినట్లు గమనించారు. ఇంటిలోకి వెళ్లి చూడగా కబోర్డ్ తలుపులు బ్రేక్ చేసి అందులో ఉన్న 65 తులాల బంగారం, 60తులాల వెండి, రూ.3లక్షలు మాయమయ్యాయి. ఈ విషయమై బాధితులు పోలీస్‌స్టేషన్ లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బీజేపీకి బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయి

బీఆర్ఎస్ జిల్లా ఇన్‌చార్జ్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి

రంగారెడ్డినగర్: సీఎం కేసీఆర్‌ను ఎదుర్కొనే దమ్ములేక అపఖ్యాతి పాలు చేసేందుకు బీజేపీ కుట్రలు పన్నుతోందని రైతుబంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడు, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి వైఎంఎస్ ఫంక్షన్‌హాలులో సోమవారం కార్పొరేటర్ విజయశేఖర్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన రంగారెడ్డినగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనానికి ఆయనతో పాటు ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, ఎమ్మెల్యే వివేకానంద్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు.

బీజేపీ కుట్రలను ఎండగట్టాలి...

◆ ఈ సందర్భంగా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో అధికారం కోసం అడ్డదారులు తొక్కుతూ అసత్య ప్రచారం చేస్తున్న బీజేపీకి బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని అన్నారు. రాష్ట్ర పర్యటనకు వచ్చిన ప్రధాని మోదీ అబద్ధాలు చెప్పారని అన్నారు. కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలతో దూసుకెళ్తుంటే బీజేపీ నేతలు అక్కసుతో మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ జాతీయ రాజకీయాల్లో క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారనే అక్కసుతో బీజేపీ అనేక కుట్రలకు పాల్పడుతోందని విమర్శించారు. ఇటువంటి ప్రయత్నాలను ఎక్కడికక్కడ ఎండగట్టాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.

పేపర్ లీక్‌లో బండి సంజయ్ అడ్డంగా దొరికిపోయారు..

◆ బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన ఇన్నేళ్లలో పేపర్ లీక్ ఎన్నడూ జరగలేదని.. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ పేపర్ లీక్‌లో అడ్డంగా దొరికి నిందను ప్రభుత్వంపై తోయాలని చూస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్‌ను ఎదుర్కొనే దమ్ము లేక పేపర్ లీక్‌లు చేస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్‌తో పోటీ పడాలంటే తెలంగాణ పథకాలు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అనుసరించి చూపించాలన్నారు. దేశ సంపదను ఆదానికి అంటగడుతున్నారని విమర్శించారు. దేశ రాజకీయాలను మలుపుతిప్పే సత్తా గులాబీ జెండాకే ఉందన్నారు.

బీఆర్ఎస్‌కు కార్యకర్తలే శ్రీరామరక్ష..

◆ అనంతరం ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ మాట్లాడుతూ... బీఆర్ఎస్‌కు కార్యకర్తలే శ్రీరామరక్ష అని అన్నారు. 9ఏళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజల్లో విస్తృత ప్రచారం చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. రాబోయే రోజుల్లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఏర్వ శంకరయ్య, ప్రధాన కార్యదర్శి సుధాకర్, మాజీ ప్రజాప్రతినిధులు, డివిజన్ సీనియర్ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.





కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే వివేకానంద్